లింకు రోడ్లకు మోక్షమెప్పుడో?

- ప్రయాణికుల అవస్థలు
- ఏళ్లుగా విన్నవించినా స్పందన కరువు


బురదతో అధ్వానంగా ఉన్న కలిగోట- పోతారం రోడ్డు

కథలాపూర్: గ్రామాలు అభివృద్ధి దిశకు అడుగులు వేయాలంటే రోడ్డు సౌకర్యమే ప్రధానం. రెండు గ్రామాలను కలిపే రోడ్లు ఏళ్లుగా మట్టి రోడ్డుతోనే ఉండటంతో ప్రయాణానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆయా గ్రామాలను కలిపే రోడ్లను అభివృద్ధి చేయాలని పాలకులకు ఏళ్లుగా ప్రజలు విన్నవించుకుంటున్న స్పందన కరువైందని కథలాపూర్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆయా గ్రామాల లింకు రోడ్లకు మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలని కోరుతున్న లింకు రోడ్లు ఇవే..

కథలాపూర్ మండలం సిరికొండ నుంచి మెట్‌పల్లి మండలం కోనరావుపేట గ్రామానికి 4 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సిరికొండ నుంచి దూలూర్ గ్రామానికి వెళ్లేందుకు 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇవి మట్టిరోడ్లు కావడంతో ప్రయాణానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పోతారం నుంచి కలిగోట వరకు సుమారు కిలోమీటరు దూరం ఉండగా... మట్టి రోడ్డు కావడం, వర్షంతో రోడ్డంతో బురదమయం కావడంతో బైకులు కూడా వెళ్లడం కష్టంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూషణరావుపేట నుంచి తాండ్ర్యాల వెళ్లేందుకు ఎడ్లబండ బాట రోడ్డు ఉండగా.. అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణమని ప్రజలు పేర్కొన్నారు. అంబారిపేట నుంచి తాండ్ర్యాల వెళ్లేందుకు, తాండ్ర్యాల గ్రామం నుంచి తుర్తి వెళ్లేందుకు మట్టి రోడ్లు కావడంతో గమ్యం చేరడానికి ఇక్కట్లపాలవుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపి మండలంలోని ఆయా గ్రామాల లింకు రోడ్ల అభివృద్ధికి చొరవ చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్లు అభివృద్ధి చేయాలి



సిరికొండ నుంచి కోనరావుపేట, కొండ్రికర్ల గ్రామాలకు వెళ్లేందుకు ఏళ్లుగా గుంతలున్న మట్టి రోడ్లు దిక్కవుతున్నాయి. రెండు గ్రామాల మధ్య 4 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికి రోడ్డు సరిగా లేకపోవడంతో అదనంగా 10 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం చొరవ చూపి లింకు రోడ్లను త్వరగా అభివృద్ధి చేయాలి. అప్పుడే ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరుతాయి.

– ముంజ నవీన్, యువకుడు, సిరికొండ

బస్సు సౌకర్యం కల్పించాలి



పోతారం- కలిగోట గ్రామాల మధ్య కిలోమీటరున్నర దూరం మట్టి రోడ్డు ఉంది. గతంలో ఈ రోడ్డు గుండా బస్సులు వెళ్లేవి. అప్పట్లోనే మట్టి రోడ్డు గుంతలతో అధ్వానంగా మారడంతో బస్సు సౌకర్యం లేకుండా పోయింది. అప్పటి నుంచి ఈ రోడ్డు మరమ్మతుకు నోచుకోలేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మట్టి రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేసి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

– ధర్మపురి జలంధర్, మాజీ సర్పంచ్, పోతారం

ప్రతిపాదనలు పంపాం



మండలంలోని ఆయా గ్రామాల లింకు రోడ్లను పరిశీలించాం. రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. రోడ్లకు నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం.

– జగదీశ్వర్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ, కథలాపూర్

క్లుప్తంగా

ఉడెన్ బ్యాడ్మింటన్ స్టేడియం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే,అదనపు కలెక్టర్

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో నిర్మించిన బ్యాడ్మింటన్ ఉడెన్ ఇండోర్ స్టేడియాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత శుక్రవారం ప్రారంభించారు. పేఅండ్‌ప్లే పథకం కింద రూ 36.50లక్షలతో నిర్మించిన ఈ స్టేడియాన్ని ప్రారంభించిన అనంతరం క్రీడాకారులతో కలిసి ఎమ్మెల్యే బ్యాడ్మింటన్ ఆడారు. కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కోరుకంటి రవికుమార్, డాక్టర్ వాసాల శ్రీధర్, భిక్షపతి, నాయకులు చెట్‌పల్లి సుధాకర్, క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు.

సీసీరోడ్లకు నిధులు మంజూరు చేయాలని వినతి

జగిత్యాల: సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ 8వ వార్డు గణేశ్‌నగర్, నర్సింగాపూర్ రోడ్ కాలనీవాసులు శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీరోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిధులు మంజూరు చేసి సీసీరోడ్డు వేయాలని కోరారు. సీసీరోడ్డు మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి


భూమిపూజ చేస్తున్న ఏఎంసీ చైర్మన్, ఎంపీడీవో

పెగడపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని నామాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేసి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఐదు దశల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని నిధుల కొరతలేదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్, కిషన్, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు సరైన భద్రత ఏర్పాట్లు చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రాములు

కోరుట్ల: పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో పట్టణ స్వర్ణకారులకు దొంగతనాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీసులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు మాట్లాడుతూ సెక్యూరిటీ బాగుంటేనే వ్యాపారం బాగుంటుందన్నారు. స్వర్ణకారులు తమ దుకాణాలకు తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోరట్ల సీఐ సురేష్ బాబు, ఎస్సై చిరంజీవి, కోరుట్ల స్వర్ణకార సహకార సంఘ నాయకులు, స్వర్ణకారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కోరుట్ల రూరల్: ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోరుట్ల మండలంలోని యూసుఫ్‌నగర్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం పరిశీలించారు. ఇండ్లల్లోని నీటి తొట్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త తొలగించే పనులు చేపట్టారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ దనుంజయగుగ్గిళ్ల సురేష్ గౌడ్,పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భీమేష్ పేర్కొన్నారు.

దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధికి కృషి

- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి


స్వామివారి చిత్రపటం అందజేస్తున్న సభ్యులు

సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం దుబ్బరాజన్న ఆలయ రెన్నొవేషన్ కమిటీ సభ్యులు ఇటీవల బాధ్యతలు స్వీకరించి, మంత్రిని ధర్మపురిలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి.. దుబ్బరాజన్న ఆలయం అతి పెద్ద శైవక్షేత్రమని, ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని వెల్లడించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ఆలయ అభివృద్ధికి నిస్వార్థంగా సేవచేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మంత్రిని సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు. సభ్యులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్, కిష్టయ్య, సత్యనారాయణరెడ్డి, శంకర్, గంగమ్మ, శేఖర్, మతులాపురం శంకర్, సత్యం, పోశాలు, ధర్మపురి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామడుగు రవి, నాయకులు బొడిగం తిరుపతిరెడ్డి ఉన్నారు.

ఎరువుల విక్రయానికి యంత్రాలు వినియోగించాలి


ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న డీసీవో

పెగడపల్లి: సహకార సంఘాల ద్వారా వానాకాలం పంటలకు అవసరమున్న మేరకు యూరియా సరఫరా చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా సహకారశాఖ అధికారి మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పెగడపల్లి మండలం నంచర్ల, పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆయా సంఘాల్లోని లావాదేవీలు, ఎరువుల క్రయవిక్రయాల రికార్డులు పరిశీలించారు. అనంతరం గోదాముల్లో నిల్వ ఉన్న ఎరువులను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు రైతుల ఆధార్‌కార్డుతో ఈపీవోఎస్ మిషన్ ద్వారా ఎరువులు విక్రయించాలని సిబ్బందికి సూచించారు. సహకార సంఘాల్లో నాణ్యమైన ఎరువులను ఎంఆర్‌పీ ధరలకే విక్రయిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఈవోలు తడుకమడ్ల గోపాల్‌రెడ్డి, రాతు మధుకర్ తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి


మాట్లాడుతున్న కన్నం అంజయ్య

పెగడపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి కన్నం అంజయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల బీజేపీ అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తొన్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాలు, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి తదితర అంశాలతో వివరిస్తానని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్, ఎన్నికల ఇన్‌చార్జీ రాంబాబు, జాతీయ సెన్సార్ బోర్డు సభ్యుడు పిల్లి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి నరేశ్, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు కొమురెల్లి, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేయాలి

వెల్గటూర్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగుర వేయాలని స్థానిక సంస్థల ఎన్నికల అభియాన్ జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి శ్రీనివాస్ అన్నారు. వెల్గటూర్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏడాదిన్నర కాలంగా స్థానిక ప్రతినిధులు లేక గ్రామ్లాలో పారిశుద్యం పడకేసి, అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలపై అలుపెరగని పోరాటం చేస్తూనే కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము రాంబాబు, మండల అధ్యక్షులు గోపతి జనార్దన్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సొసైటీలో పురుగుల మందులు అమ్మరాదు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పురుగుల మందులు అమ్మకూడదని ఏవో రాజ్‌కుమార్ శుక్రవారం సీఈవో మంత్రి సతీష్‌కుమార్‌కు నోటీసు అందజేశారు. సొసైటీని తనిఖీ చేసి ఎరువులు, పురుగుల మందుల విక్రయాలకు సంబంధించి రికార్డులను, రశీదులను పరిశీలించారు. విక్రయాలకు సంబందించి రికార్డులు సరిగ్గా నమోదు చేయకపోవడంతో 21 రోజుల పాటు పురుగుల మందుల విక్రయాలు చేపట్టవద్దని కోరారు.

బైక్ దొంగతనం కేసులో రెండేళ్ల జైలు

ధర్మపురి: బైక్ దొంగతనం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ ధర్మపురి ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి జానకి తీర్పునిచ్చారు. ధర్మపురి స్టేషన్ పరిధిలో షబ్బీర్ అహ్మద్ బేగ్ 2024 మే 14న తన ఇంటిముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేయగా కేసు నమోదయింది. కేసు దర్యాప్తులో భాగంగా ఎస్సైలు ఉదయ్‌కుమార్, మహేశ్ ఖమ్మం జిల్లాకు చెందిన గుర్రం కోటేశ్వర్‌ను నిందితుడిగా గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్ సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టగా, నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి శిక్ష విధించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కథలాపూర్: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కథలాపూర్ మండలం గంభీర్‌పూర్, కలిగోట, తాండ్ర్యాల, అంబారిపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ పులికాంత శశిధర్, మండల ప్రతినిధులు కృష్ణారావు, సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ శుక్రవారం మాజీ జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట రూరల్, అర్బన్ మండల శాఖ అధ్యక్షులు తుమ్మ గంగాధర్, ఆనందరావు, నాయకులు కమలాకర్, లక్ష్మణ్‌రావు, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బుగ్గారం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు,నాయకులు పనిచేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గాలిపెల్లి మహేశ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని గోపులాపూర్‌లో పార్టీ మండల శాఖ సమావేశం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలాగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గోపులాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు కొక్కెం మోహన్,స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణ

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కోరుట్ల అధ్యక్షుడు డాక్టర్ రేగొండ రాజేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల జీవన్ రెడ్డి, కార్యదర్శి ఏలేటి లక్ష్మారెడ్డి, కోశాధికారి నల్ల గంగాదర్, పలువురు లయన్స్ క్లబ్ నాయకులు, హెచ్‌ఎం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

జగిత్యాలటౌన్: శ్రావణ మాస మొదటి శుక్రవారం భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. పట్టణంలోని అష్టలక్ష్మి ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయం, ధరూర్ క్యాంపు కోదండ రామాలయం, చింతకుంట మడేలేశ్వరస్వామి ఆలయం, శ్రీసూర్య ధన్వంతరి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు కుంకుమార్చనలు, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు.

హాస్టళ్లలో అధికారుల తనిఖీ

కథలాపూర్: కథలాపూర్‌లో మోడల్‌స్కూల్, కేజీబీవీ హాస్టళ్లను తహసీల్దార్ వినోద్, వైద్యాధికారి సింధూజ శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్నభోజనం సమయంలో విద్యార్థులకు ఏ విధంగా భోజనం అందిస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ అభిషేక్, ఏఎన్‌ఎం శిరీషా పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో..

సారంగాపూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ వహిదొద్దీన్, ఎంపీడీవో గంగాధర్ అన్నారు. శుక్రవారం సారంగాపూర్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయం, సాంఘీక సంక్షేమ వసతిగృహలను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల అమలవుతున్న మెనూను పరిశీలించి, వంట నిర్వహిస్తున్న వారికి పలు సూచనలు చేశారు. వారి వెంట మండల వైద్యాధికారి డాక్టర్ రాధారెడ్డి, ఎంపీవో సలీం, సిబ్బంది ఉన్నారు.



జగిత్యాలటౌన్: ప్రధాన రహదారులపై పశువులు తిష్ట వేస్తుండటంతో పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాల శబ్దాలకు బెదిరి రోడ్డుపై అటు ఇటు పరుగెత్తుతుండటంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కొన్నిసార్లు పశువులు సైతం వాహనాల కింద పడి చనిపోతున్నాయి. పశువుల యజమానులను గుర్తించి వారికి అప్పగించాలని లేదా గోశాలకు తరలించి రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
స్పందన, కమిషనర్, జగిత్యాల బల్దియా సెల్ నం.: 9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అర్హులందరికీ రేషన్‌కార్డులు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


రేషన్ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మల్యాల/కొడిమ్యాల: నిరుపేదల ఆత్మగౌరవానికి రేషన్‌కార్డు ప్రతీక అని, రేషన్ కార్డు నిరంతర ప్రకియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డు అందజేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్, అన్నారు. మల్యాల, కొడిమ్యాల మండల కేంద్రాల్లో శుక్రవారం నూతన రేషన్‌కార్డులను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ రేషన్‌కార్డు నిరుపేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, సివిల్ సప్లై అధికారి జితేందర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్, తహసీల్దార్లు వసంత, కిరణ్. ఎంపీడీవో స్వరూప,ప్యాక్స్ చైర్మన్ రాజ నర్సింగరావు, చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన


రోడ్డుపై నాట్లు వేస్తున్న గ్రామస్తులు

వెల్గటూర్: మండలంలోని వెంకటాపూర్‌లో బురద రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించడం లేదంటూ గ్రామస్తులు బురద రోడ్డులో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోకి వెళ్లే ఏకైక రోడ్డు ఎన్నో ఏళ్లుగా రోడ్డు నిర్మాణం చేయక పోవడంతో వర్షాకాలం వచ్చిందంటే గుంతలు, బురదతో నిండిపోయి ప్రయాణం నరక ప్రాయంగా మారుతుందని వాపోయారు. సమస్యను మంత్రి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన మంత్రి 1.40 లక్షలతో రోడ్డు నిర్మాణం చేయడానికి మే నెలలో మంత్రి సీతక్క చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ ఇంకా పనులు ప్రారంభించలేదు. అంతలోనే వర్షాకాలం రావడంతో మరోసారి రోడ్డంతా బురదమయమైంది. దీంతో గ్రామస్తులు నిరసన తెలపడంతో వెంటనే ఎంపీడీవో శ్రీనివాస్ స్పందించి రోడ్డుపై మట్టిపోయించి చదును చేయించారు. త్వరలోనే రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

జగిత్యాల: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థులు 2025–26 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం సెప్టెంబర్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు తెలియజేయాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు ఈపాస్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

27న వృద్ధులు, దివ్యాంగులు తరలిరండి

కథలాపూర్: ఈనెల 27న జగిత్యాలకు జిల్లాలోని వృద్ధులు, దివ్యాంగులు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కాశవత్తుల లక్ష్మీరాజం కోరారు. శుక్రవారం కథలాపూర్‌లో దివ్యాంగుల, వృద్ధుల సమావేశం ఏర్పాటు చేశారు. జగిత్యాలకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను పెంచాలనే డిమాండ్‌తో సమావేశం ఉంటుందన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.

విద్యార్థులకు టీషర్ట్‌లు అందజేత

వెల్గటూర్: ఎండపల్లి మండలం కొండాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డా.గురువారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, దాతల సహకారంతో సమకూర్చిన టీషర్ట్‌లు, టై, బెల్ట్‌లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాంచంద్రం, పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులను విస్మరిస్తే చర్యలు

జగిత్యాల: వృద్ధులను కుమారులు, కూతుళ్లు విస్మరిస్తే చర్యలుంటాయని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. కొందరు వృద్ధులు కొడుకులు పట్టించుకోవడం లేదని హరి అశోక్‌కుమార్‌కు విన్నవించుకోగా ఆర్డీవో మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ వృద్ధ తల్లిదండ్రులను వారి పిల్లలు పట్టించుకోవాలని, లేనిచో చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురి అటవీశాఖ రేంజర్‌పై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన గిరిజన రైతు బోడ సాగర్ ఫిర్యాదు మేరకు అటవీశాఖ ధర్మపురి రేంజర్ (ఎఫ్‌ఆర్‌వో) శ్రీనాథ్‌పై బీర్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బోడ సాగర్ గ్రామ శివారుల్లోని సొంత భూముల్లో వ్యవసాయం చేస్తుంటాడు. అతడు సాగుచేసిన భూమి అటవీశాఖ పరిధిలోకి వస్తుందని భూమిలో వేసిన షెడ్డు, మామిడి చెట్లు, ఇతర పంటలను ధర్మపురి అటవీశాఖ రేంజర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది తొలగించారు. అటవీ భూమి కబ్జా చేసి పంటలు సాగుచేస్తున్నాడని బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సాగర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. 18 రోజులు జైలు జీవితం గడిపిన సాగర్ ఇటీవల విడుదలయ్యాడు. తాను గిరిజనుడనని, తన తాతల కాలం నుంచి వంశపారంపర్యంగా వచ్చిన భూమిని సాగుచేసుకుంటే, తనపై కక్ష కట్టి ఎఫ్‌ఆర్‌వో శ్రీనాథ్ తన పంటను, ఆస్తిని ధ్వంసం చేశారని, తనకు నష్టం చేసిన ఎఫ్‌ఆర్‌వోపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో ఎఫ్‌ఆర్‌వో శ్రీనాథ్‌పై పోలీసులు గురువారం రాత్రి పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.